సాక్షి ఒడిశా

శుక్రవారం । 7 । మార్చి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 4,11,293

బంగారం : 650 మిల్లీ గ్రాములు

వెండి : 8 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



నీలకంఠ సాగర్ అభివృద్ధి పనులపై అసంతృప్తి - 8లో

జయపురంలో మరో చారిత్రక పెద్ద చెరువు నీలకంఠ సాగర్ పునరుద్ధరణ, సుందరీకరణ పనులు సగంలో ఆగిపోయాయి.



కొరాపుట్ జిల్లాలో రాజమౌళి సినిమా - 8లో

ప్రపంచ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న కొరాపుట్‌లో రాజమౌళి, మహేష్ బాబు సినిమా షూటింగ్ జరుగుతోంది.

న్యూస్‌రీల్

నేడు జమ్మి ఎల్లమ్మ జాతర



జమ్మి జాతర సందర్భంగా ఎల్లమ్మ తల్లిని పురవీధుల్లో తిప్పుతున్న పూజారి

జయపురం: స్థానిక గోపబంధు నగర్‌లో శుక్రవారం జమ్మి ఎల్లమ్మ జాతర నిర్వహించనున్నారు. గత గురువారం నుంచి ఇక్కడ ఉత్సవం జరుగుతోంది. శుక్రవారం గోపబంధు నగర్ నుంచి పట్టణ ప్రధాన మార్గంలోగల బంకమఠం వద్ద జాతర ముగియనుంది. ఈ సందర్భంగా బాల బాలికలు ఉదయానే ప్రతి ఇంటికి వెళ్లి జోగి దండుతారు. వాటిని జమ్మి ఎల్లమ్మ జాతరలో సమర్పిస్తారు. తెలుగు వారు సిర్లి పండగగా పిలుస్తారు.

230 కిలోల గంజాయి స్వాధీనం



బలిమెల పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు బుధవారం రాత్రి 15 బస్తాల్లోని 230 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో గల నీలకంబేరు పంచాయతీ కందాగూఢ గ్రామం అడవిలో 15 బస్తాల గంజాయి ఉందని బలిమెల ఐఐసీ ధీరజ్ పట్నాయక్‌కు సమాచారం రావడంతో ఆయన బుధవారం రాత్రి తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. వారి రాకను గమనించి గంజాయి బ్యాచ్ పరారైపోయింది. పోలీసులు బస్తాలు స్వాధీనం చేసుకుని గురువారం తూకం వేయగా 230 కిలోలు కనిపించింది. మొత్తం 15 బస్తాల్లో దీని విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

దుకాణాలు దగ్ధం



మంటల్లో బూడిదైన వస్తువులు

భువనేశ్వర్: పారాదీప్ ప్రాంతంలో 3 దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో దుకాణదారులు గాయపడ్డారు. స్థానిక దోఛొక్కి గ్యారేజీలో మంటలు చెలరేగడంతో 3 దుకాణాలకు మంటలు వ్యాపించాయి. ఈ మంటలు ఆర్పే ప్రయత్నంలో దుకాణదారులకు గాయాలయ్యాయి. కుజంగ్ అగ్నిమాపక దళం ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసింది.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు ప్రకాష్

రాయగడ: అత్యాచారం కేసుకు సంబంధించి జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసులు ఒక నిందితుడిని అరెస్టు చేసి గురువారం కోర్టుకు తరలించారు. అరెస్టైన వ్యక్తి టికిరి పంచాయతీలోని కలియాకొన గ్రామానికి చెందిన ప్రకాష్ మాఝిగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. కలియాకొన గ్రామానికి చెందిన ఒక దివ్యాంగురాలు తన తల్లితో కలిసి గ్రామ సమీపంలోని అడవిలో కట్టెలు తీసుకొచ్చేందుకు వెళ్లింది. ఆ సమయంలో దివ్యాంగురాలు ఒక చెట్టుకింద ఉండడం గమనించిన ప్రకాష్ ఆమెకు మాయ మాటలు చెప్పి అత్యాచారం చేశాడు. దీంతో మానసిక దివ్యాంగురాలైన తన కూతురుపై అత్యాచారం చేశాడని బాధితురాలి తల్లి టికిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా బీజేడీ నిరసన

- ప్రభుత్వం బిజూ పట్నాయక్‌ను అవమానించిందని మండిపాటు

భువనేశ్వర్: బిజూ పట్నాయక్ జయంతి సందర్భంగా నిర్వహించాల్సిన పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలకు ప్రస్తుత ప్రభుత్వం అకస్మాతుగా తెర దించింది. ఈ చర్యతో బిజూ జనతా దళ్ తీవ్ర మనస్తాపానికి గురైంది. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా మారిందని బిజూ జనతా దళ్ కార్యకర్తలు ఆగ్రహించారు. క్యాలెండర్‌లో సెలవు దినంగా ప్రకటించినా, దాన్ని ప్రకటించలేదు. ఈ చర్యలకు వ్యతిరేకంగా గురువారం బిజూ జనతా దళ్ రాష్ట్ర వ్యాప్తంగా బిజూ పట్నాయక్ పట్ల జరిగిన అగౌరవానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగింది. లక్షలాది ఒడియా ప్రజల ప్రియతమ నాయకుడికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా బీజేడీ ఈ ఆందోళనకు దిగింది. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర చరిత్రకారుని జయంత్యుత్సవాన్ని మసకబారించడం విచారకరమని ఆయన వ్యాఖ్యానించారు. తాల్చేర్ ఎన్టీపీసీ, హాల్, రౌర్కెలా నిట్, ఓయూఏటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ఆవిష్కర్త పట్ల రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీవ్ర అన్యాయాన్ని బిజూ జనతా దళ్ సహించేది లేదని నినాదాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ప్రధాన కార్యాలయాల్లో ఈ ఆందోళన తీవ్ర స్థాయిలో నిర్వహించారు. నయాగడ్ ప్రాంతంలో బీజేడీ ఆందోళనకారులు కలెక్టరు కార్యాలయం గేటు తాళాలు విరగొట్టి లోనికి చొరబడి అలజడి రేపారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: ఒడిశా ప్రభుత్వం మార్చ్ 5 వ తేదీన పంచాయతీ రాజ్ దినోత్సవం జరుపుకోకపోవడంపై బీజేడీ కార్యకర్తలు మల్కన్‌గిరిలో నిరసన తెలిపారు. బీజేపీ నేతలు ఒడిశా ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశారని అన్నారు. 1991లో మొదట ఒడిశాలో బిజుపట్నాయిక్ పంచాయతీ రాజ్‌ను అమలు చేస్తే దేశవ్యాప్తంగా 1992లో అమలు చేశారని గుర్తు చేశారు. నిరసన సభలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టంగులు, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మనాస్ మద్కామి, మల్కన్‌గిరి పూరపాలక అధ్యక్షుడు మనోజ్ బారిక్ ,ఉపాధ్యక్షురాలు కవితా మోహంతి తదితరులు పాల్గొన్నారు.



భువనేశ్వర్: కటక్ నగరంలో బీజేడీ కార్యకర్తల ఆందోళన



భువనేశ్వర్: కలెక్టరేటు కార్యాలయం ముట్టడించిన నయాగడ్ జిల్లా శాఖ బీజేడీ కార్యకర్తలు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి హిమిరిక

సెలవు రద్దుపై బీజేడీ శ్రేణుల నిరసన



రాజవీధి ఆటో జంక్షన్ వద్ద బిజేడీ శ్రేణుల నిరసనలో మాట్లాడుతున్న పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి

పర్లాకిమిడి: జన నాయకుడు, దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయిక్ జయంతి నాడు పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినాన్ని రద్దు చేయడం మహానాయకున్ని అవమానించినట్టేనని బీజేడీ ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. స్థానిక హైస్కూల్ జంక్షన్ వద్ద బిజూ పట్నాయిక్ విగ్రహానికి పూలమాలలు వేసి బీజేడీ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. రాజవీధి ఆటో జంక్షన్ వద్ద టైర్లు కాల్చారు. ఈ నిరసనలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్, కాశీనగర్ బ్లాక్ చైర్మన్ బల్ల శాయమ్మ, గుసాని సమితి చైర్మన్ ఎన్.వీర్రాజు, గుమ్మా సమితిల చైర్మన్లు, ఎం.కృష్ణారావు, గుసాని జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, బసంత్ దాస్, రాష్ట్ర బీజేడీ సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, బిజేడి పార్టీ ఉపాధ్యక్షులు లక్ష్మీకాంత పోరిచ్చా, మహిళా బీజేడీ నాయకురాలు సంజుక్తా బెహరా తదితరలు పాల్గొన్నారు.



బిజూ పట్నాయక్ జంక్షన్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న బీజేడీ పార్టీ శ్రేణులు

బీజేడీ శ్రేణుల నిరసన

రాయగడ: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ బిజు పట్నాయక్ జయంతిని పురష్కరించుకుని ఏటా మార్చి 5 న జరుపుకునే పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని రద్దు చేయడంపై ఆ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గల బిజు పట్నాయక్ విగ్రహం వద్ద బీజేడీ నాయకులు, మహిళా కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. జననాయకుడు బిజుకి బీజేపీ ఇస్తున్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. సుమారు రెండు గంటల పాటుగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, సీనియర్ నాయకులు, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు గంగాధర్ పువ్వల, సుజాత పాలో తదితరులు పాల్గొన్నారు.



బిజు విగ్రహం వద్ద నిరసనలో బీజేడీ మహిళా కార్యకర్తలు

ముఖ్యమంత్రి గృహ ప్రవేశం



నూతన గృహంలో ముఖ్యమంత్రి పూజాదులు

- ముఖ్యమంత్రి అధికారిక భవనానికి పూర్వ కళ

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధికారిక భవనంలో గృహ ప్రవేశం చేశారు. గురువారం ఉదయం 10.47 గంటల సుముహూర్తంలో కుటుంబ సమేతంగా ఈ భవనంలోనికి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా నూతన భవనంలో ప్రత్యేక హోమాదులు నిర్వహించారు. పూరీ నుంచి విచ్చేసిన ప్రత్యేక పురోహిత బృందం ఈ పూజాదులు నిర్వహించారు. స్థానిక రాజ్ భవన్, ఏజీ స్క్వేర్ మధ్య నగరం నడి బొడ్డున ముఖ్యమంత్రి అధికారిక భవనం రెండంతస్తుల భవన సముదాయం నెలకొని ఉంది.

25 ఏళ్ల తర్వాత..

దాదాపు 25 ఏళ్ల తర్వాత ముఖ్యమంత్రి అధికారిక భవనం కొత్త శోభని సంతరించుకోవడం విశేషం. సుమారు రెండున్నర దశాబ్దాలుగా ఈ భవనం ఖాళీగా పడి ఉంది. దీంతో పూర్తిగా పాతబడి సుమారు శిథిలావస్థకు చేరింది. 2000 సంవత్సరం నుండి, నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నుంచి ముఖ్యమంత్రి అధికారిక భవనం ఖాళీగా ఉంది. మాజీ ముఖ్యమంత్రి తన సొంత ప్రైవేట్ నివాసంలో నివసించడానికి ఎంచుకోవడంతో ఈ పరిస్థితి చోటు చేసుకుంది. ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు (ఎల్‌ఓపీ) నవీన్ పట్నాయక్ తన సుదీర్ఘ 24 సంవత్సరాల పదవీ కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా తన వ్యక్తిగత ఇల్లు నవీన్ నివాస్ నుంచి రాష్ట్ర పాలన కార్యకలాపాలు నిర్వహించారు. తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ నిర్మించిన భవనం నవీన్ నివాస్ నుంచి పావు శతాబ్దం పాటు అన్ని అధికారిక, పరిపాలనా పనులు చివరి వరకు నిర్వహించారు. నవీన్ పట్నాయక్ పదవీకాలానికి ముందు ముఖ్యమంత్రి అధికారిక భవనం ముఖ్యమంత్రుల నివాసంతో నిత్యం హడావుడిగా ఉండేది. అయనకు ముందు మాజీ ముఖ్యమంత్రులు జేబీ పట్నాయక్, గిరిధర్ గొమాంగొలకు ఈ భవనం నివాసంగా ఉండేది.

పునరుద్ధరణ

ముఖ్యమంత్రి నివాసం చాలా కాలంగా నిరుపయోగంగా ఉండటంతో ప్రభుత్వం ఎనిమిది నెలల పాటు దీర్ఘ కాలం శ్రమించి భారీ పునరుద్ధరణ ప్రాజెక్టును చేపట్టాల్సి వచ్చింది. భారీ వ్యయ ప్రయాసలతో ఆ నివాసాన్ని మళ్లీ నివాసయోగ్యంగా పునరుద్ధరించారు. పునరుద్ధరించిన ఈ భవనంలో బహుళ సమావేశ గదులు, భద్రత కోసం ఒక వాచ్ టవర్ మరియు ముందు భాగంలో విశాలమైన ఆకర్షణీయమైన తోట సాదరంగా స్వాగతం పలుకుతుంది. మోహన్ చరణ్ మాఝి ఇప్పుడు అధికారికంగా నివాసానికి మారడంతో ముఖ్యమంత్రి నివాసం పావు శతాబ్దం నిద్రాణస్థితి తర్వాత మరోసారి రాజకీయ కార్యకలాపాల కేంద్రంగా మారింది.

పవిత్ర హోమాదులతో గృహ ప్రవేశం

పూరీ నుంచి వచ్చిన 11 మంది బ్రాహ్మణ పూజారుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి అధికారిక భవనం గృహ ప్రవేశం పూజాదులు అత్యంత నియమ నిష్టలతో నిర్వహించారు. హిందూ ఆచార సంప్రదాయాల ప్రకారం తొలుత ఆవు, దూడని ఇంటిలోకి అడుగు పెట్టించారు. ఈ ఆచారం కొత్త ఇంటికి శ్రేయస్సు, సానుకూల శక్తిని కూడగడుతుందని ముఖ్యమంత్రి నమ్మకం వ్యక్తం చేశారు. దీని తర్వాత ముఖ్యమంత్రి దంపతులు కుటుంబ సమేతంగా గృహ ప్రవేశం నిర్వహించారు. పంచాంగం గణాంకాల ప్రకారం గురువారం ఉదయం 10.47 గంటలకు సీఎం మాఝి తన కుటుంబంతో కలిసి నివాసంలోకి అధికారికంగా ప్రవేశించారు.

ముగిసిన మెట్రిక్యులేషన్ పరీక్షలు

- మే నెల మొదటి వారంలో ఫలితాలు
- త్వరలో మూల్యాంకనం

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు బీఎస్ఈ ఆధ్వర్యంలో పదో తరగతి (మెట్రిక్యులేషన్) వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. త్వరలో జవాబు పత్రాలు దిద్దే మూల్యాంకనం ప్రక్రియకు సన్నాహాలు చేస్తున్నారు. అంచెలంచెలుగా ఒక్కో ప్రక్రియ ముగించి మే నెల మొదటి వారంలో పరీక్ష ఫలితాలు వెల్లడించేందుకు చురుగ్గా సన్నాహాలు చేస్తున్నట్లు బీఎస్ఈ అధ్యక్షుడు శ్రీకాంత్ తొరాయ్ ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,133 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా పూర్తయ్యాయి. ఈ నెల 19 నుంచి మూల్యాంకనం ప్రారంభమవుతుందని తెలిపారు. మెట్రిక్యులేషన్ ఫలితాలను మే నెల మొదటి వారంలో ప్రకటిస్తామన్నారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర అనివార్య పరిస్థితుల కారణంగా ఎలాంటి అవాంతరం తలెత్తకుంటే ముందస్తు ప్రణాళిక ప్రకారం ఫలితాలను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు, పోలీసు దళాలు, మీడియా వ్యక్తులకు అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.

చర్యలు ఫలప్రదం

ఈ ఏడాది పరీక్షల నిర్వహణ పురస్కరించుకుని ప్రశ్న ప్రతాల లీకేజి అరికట్టేందుకు కట్టుదిట్టంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో బార్ కోడ్‌లు, ఎన్‌క్రిప్టెడ్ సెక్యూరిటీ నంబర్లు, వాటర్‌మార్క్‌లతో సహా బోర్డు తీసుకున్న వివిధ భద్రతా చర్యలు లీకేజీలు, ఇతర అంతరాయాలను నివారించడంలో విజయవంతమయ్యాయని ఆయన పేర్కొన్నారు. బోర్డు లైవ్ ఫీడ్ ద్వారా పరీక్షా కేంద్రాల కార్యకలాపాలను పర్యవేక్షించే విస్తృతమైన సెంట్రల్ కమాండ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సంవత్సరం నిర్వహించిన మెట్రిక్యులేషన్ పరీక్షలకు 5 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో మాధ్యమ, స్టేట్ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు కూడా ఉన్నారు. రాష్ట్రం అంతటా 3,133 కేంద్రాలలో నిత్యం ఉదయం 9 గంటల నుండి 11.30 గంటల వరకు ఈ పరీక్షలు జరిగాయి.

సుభద్ర పథకంపై అవగాహన



నియమగిరిలో ర్యాలీలో పాల్గొన్న డొంగిరియా మహిళలు

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు తీసుకొచ్చిన సుభద్ర పథకంపై అందరికీ అవగాహన కలిగేలా జిల్లా యంత్రాంగం చైతన్య, ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లాలోని కొలనారలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పరిధి నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీలు సైతం ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ర్యాలీలో బీరీనా ప్రధాన్, సీడీపీవో బిజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి పోర్ట్ బ్లెయిర్‌కు విమాన సేవలు

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) నుంచి ఘజియాబాద్ మరియు పోర్ట్ బ్లెయిర్ ప్రాంతాలకు ప్రత్యక్ష విమాన యాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈనెల 30వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. భారత ప్రభుత్వ కొత్త గమ్యస్థాన విధానం ప్రకారం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నిత్యం ఈ సేవలను నిర్వహిస్తుందని తెలిపారు. రాజధాని నగరం భువనేశ్వర్ నుంచి మరో రెండు నగరాలకు కొత్తగా ప్రత్యక్ష విమానయాన అనుసంధానంపై సీఎం మోహన్‌చరణ్ మాఝి హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

నదుల అనుసంధానానికి కేటాయింపులేవీ?



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: వంశధార, బాహుదా నదుల అనుసంధానానికి తాజా బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయకపోవడం దారుణమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. గురువారం శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే, నదులను అనుసంధానం చేసే కార్యక్రమాలు చేపడతామని ఎన్నికల ముందు అట్టహాసంగా ప్రకటనలు చేసిన చంద్రబాబు ఇప్పుడు ఆ విషయాన్నే విస్మరించడం సరికాదన్నారు. ముఖ్యంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు, రైతాంగానికి ఎంతో అవసరమైన వంశధార నది జలాలను బాహుదాకు అనుసంధానం చేసేందుకు బడ్జెట్లో ఒక రూపాయి కూడా కేటాయింపులు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. కేవలం వర్షాధారం మీదే వ్యవసాయ రంగం కొనసాగుతోందన్నారు.

10న అప్రెంటీస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

భక్తుడిపై దాసుడి దురుసు ప్రవర్తన



తనపై దాడి జరిగిందని చెబుతున్న ధర్మారావు

సంతబొమ్మాళి: తక్కువ డబ్బులు పళ్లెంలో పెట్టానని ఆగ్రహిస్తూ సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేట పంచాయతీ పోతునాయుడుపేట గ్రామానికి చెందిన రెయ్యమ్మ దాసుడు (పరపటి రాము) తనపై దాడి చేశాడని టెక్కలి మండలం బొరిగిపేట గ్రామానికి చెందిన రోణంకి ధర్మారావు ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం దాసుడి వద్దకు వెళ్లి పళ్లెంలో పండ్లు, రూ.50 పెట్టగా.. ఇంత తక్కువ ఇస్తావా అంటూ ఆగ్రహిస్తూ పండ్లు, డబ్బులను బయటకు విసిరేశాడని, ఇదేంటని ప్రశ్నిస్తే దాడిచేసి సెల్‌ఫోన్ లాక్కున్నాడని వాపోయాడు. సెల్‌ఫోన్ తిరిగిచ్చేయాలని కోరితే అనుచరులు బయటకు గెంటేశారని, కొంతసేపటి తర్వాతే తిరిగిచ్చారని చెప్పాడు. కాగా, ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీశారు.

బార్ కౌన్సిల్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయవాదుల బార్ కౌన్సిల్ ఎన్నికలకు నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. ఏడాదికి ఒకసారి జరిగే ఈ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు కె.ఈశ్వరరావు, వై.ప్రసన్నకుమార్ ప్రకటించారు. ఈ నెల 10న ఎన్నికల అధికారిని నియామకం, 17న నామినేషన్ల స్వీకరణ, 19న నామినేషన్లు పరిశీలన, 20న నామినేషన్ల ఉపసంహరణ, 21న పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తారు. 27న ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. కార్యవర్గంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి, మహిళా ప్రతినిధులు తదితర సభ్యులను ఎన్నుకుంటారు.

లిఫ్ట్ ఇచ్చి.. పుస్తెలతాడు కొట్టేసి..

- మానంపేట వద్ద చైన్‌స్నాచింగ్
- వృద్ధురాలికి స్వల్ప గాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అవతారం

జి.సిగడాం: మండలంలోని మద్రివలస గ్రామంలో వృద్ధురాలి మెడలో పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి తెంచుకుపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్రివలసకు చెందిన పలిశెట్టి కన్నమ్మ మానంపేట గ్రామానికి నడిచి వెళ్తుండగా అటువైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి లిఫ్ట్ అడిగింది. మానంపేట వద్ద దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వెనకి నుంచి వచ్చి ముఖంపై కారంజల్లి మెడలో తులన్నర బంగారు పుస్తెల తాడును తెంచుకుని బైక్‌తో పరారయ్యాడు. ఈ ఘటనలో వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎం.అవతారం, ఎస్‌ఐ మధుసూదనరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీలకంఠ సాగర్ అభివృద్ధి పనులపై అసంతృప్తి



నీలకంఠ సాగర్ పనులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శౌశ్య రెడ్డి

జయపురం: జయపురంలో మరో చారిత్రిక పెద్ద చెరువు నీలకంఠ సాగర్ పునరుద్ధరణ, సౌందరీకరణ పనులు సగంలో ఆగిపోయాయి. గురువారం జయపురం సబ్ కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి అక్కవరం శౌశ్యా రెడ్డి నీలకంఠ సాగర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మున్సిపల్ ఇంజినీర్ ఉన్నారు. నీలకంఠ సాగర్ పనులు పరిశీలించిన సబ్ కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పనులు పూర్తిచేయాలని, కంట్రాక్టర్‌కు నోటీసు పంపాలని ఇంజినీర్‌ను ఆదేశించారు. మూడేళ్లుగా నీలకంఠ సాగర్ పనులు జరుగుతున్నాయి. నేటికీ ప్రహరీ పనులు పూర్తి కాలేదు. మట్టి తీత, బురద తొలగింపు పనులు కూడా పూర్తి కాలేదు. పునరుద్ధరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ నీలకంఠ సాగర్‌ను సందర్శించి పనులు వెంటనే పూర్తిచేయాలని కంట్రాక్టర్‌ను ఆదేశించారు. అయినా పనులు సాగటంలేదు. 22 ఎకరాల నీలకంఠ సాగర్‌లో 16 ఎకరాల్లో బురద తొలగించారని తెలుస్తుంది. నీలకంఠ సాగర్ సుందరీకరణలో నాలుగు పక్కల పాద రస్తా, పార్క్, ఓపెన్ జిమ్, జలాశయం మధ్యలో వ్యూ పాయింట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కంట్రాక్ట్‌ను నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వారు టెండర్లో దక్కించుకున్నారు. ఈ సంస్థ వారు సబ్ కంట్రాక్టర్లకు ఇచ్చినట్లు తెలిసింది. రూ.9 కోట్ల 58 లక్షల వ్యయంతో నీలకంఠ సాగర్ పునరుద్ధరణ, సౌందర్యీకరణ పనులు చేపట్టారు. ఈ పనులను ఏప్రిల్ నెలలోగా పూర్తి చేయాలని కంట్రాక్టర్‌ను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

ఏప్రిల్ 2న పాఠశాలల్లో 'ప్రవేశ ఉత్సవ్'

భువనేశ్వర్ : ఏప్రిల్ 1 నుంచి 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 2న అన్ని పాఠశాలల్లో కొత్త విద్యా విధానం (ఎన్‌ఈపీ) రాష్ట్ర వ్యాప్త ప్రచార కార్యక్రమం చేపడుతోంది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో ప్రవేశ ఉత్సవ్, అక్షరాభ్యాసం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం మంత్రి నిత్యానంద గోండ్ తెలిపారు. ఈ ప్రచారంలో తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, పుర ప్రముఖులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 3 నుంచి 5 వరకు పాఠశాల స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకంగా ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొంటారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాలలు మరియు సామూహిక విద్యా శాఖ కమిషనర్ కమ్ కార్యదర్శి షాలిని పండిట్ అన్ని జిల్లా కలెక్టర్లు మరియు మేజిస్ట్రేట్‌లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శిశు వాటిక మరియు ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ఆహ్వాన పత్రాలు పిల్లల కుటుంబాలకు పంపిణీ చేస్తారు. ప్రవేశ ఉత్సవ్‌ను విజయవంతంగా జరుపుకోవడానికి, ప్రతి ప్రాథమిక పాఠశాల పరివాహక ప్రాంతంలోని శిశు వాటిక, 1వ తరగతిలో ప్రవేశించే విద్యార్థులను జాబితా చేయాలని జిల్లా యంత్రాంగాన్ని కోరింది. జిల్లా యంత్రాంగం గుర్తించిన విద్యార్థుల సంఖ్య ప్రకారం ఆహ్వాన పత్రాలు ముద్రించి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తారు. జిల్లా యంత్రాంగం మండల, జిల్లా విద్యాధికారులు మరియు ఇతర వాటాదారులతో సమన్వయం చేసుకుని మండల, జిల్లా స్థాయిలో ఏప్రిల్ 2, 2025న అన్ని పాఠశాలల్లో ప్రవేశ ఉత్సవ్, అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకునేందుకు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రముఖులను అతిథులుగా ఆహ్వానిస్తారు. ఈ ఏడాది జనవరి నెల నుండి రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 అమలును పాఠశాల, సామూహిక విద్యా శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ చొరవలో భాగంగా జాతీయ పాఠ్య ప్రణాళిక విధానం (ఎన్‌సీఎఫ్) మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర పాఠ్య ప్రణాళిక విధానం అమలు చేయనున్నట్లు విభాగం పేర్కొంది.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు



అగ్ని ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేస్తున్న మంచ్

జయపురం: వేసవి కాలంలో అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అటవీ విభాగ అధికారులు మంచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అడవుల్లో ఎక్కడ అగ్నిప్రమాదం సంభవించినా వెంటనే తెలుసుకునేందుకు మంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జయపురం అటవీ రేంజర్ సచ్చిదానంద పౌరిడ వెల్లడించారు. మొదటిసారిగా పినాంగి సంరక్షణ అడవిలో గురువారం మంచ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే కొరాపుట్ ఘాట్ రోడ్డు, పాత్రోపుట్ ప్రాంతాల్లో మంచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అడవులను అగ్నిప్రమాదాల నుంచి రక్షించేందుకు కొండలపై మంచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మంచ్ ఎత్తు 15 అడుగుల ఉంటుందని, మంచ్‌పై కూర్చొనేందుకు పది అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంచ్‌పై అటవీ ఉద్యోగులు కూర్చుంటారని, ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు మంచ్‌పై చుట్టూ పరిశీలిస్తారన్నారు. ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా తెలుసుకుని వెంటనే అటవీ విభాగ అధికారులు తెలియజేస్తారన్నారు. వెంటనే మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టటం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



ఆస్పత్రిలో విక్రమ్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



విక్రమ్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి చందన్‌గూడ గ్రామం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పదో తరగతి పరీక్షల చివరి రోజు కావడంతో విక్రమ్ సర్దార్(15) మరో విద్యార్థితో కలిసి బయల్దేరాడు. ఈ బాలుడు మల్కన్‌గిరి సమితి పద్మాగిరి పంచాయతీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. వీరికి సీరాపల్లి పాఠశాలలో సెంటర్ పడింది. దీంతో బైక్‌పై వెళ్తుండగా పికప్ వ్యాన్ ఢీకొట్టడంతో తలకు బలంగా గాయమైంది. అక్కడే స్పృహ కోల్పోయాడు. స్థానికులు వెంటనే మల్కన్‌గిరి ఆస్పత్రికి తరలించగా విక్రమ్ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం తర్వాత తల్లిదండ్రులకు అప్పగించారు.

భారీగా గంజాయి స్వాధీనం



పోలీసులకు పట్టుబడిన గంజాయి బస్తాలు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి దట్టమైన అడవుల్లో భారీగా గంజాయి బస్తాలను బొయిపరిగుడ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి 11 క్వింటాళ్ల 58 కేజీల 600 గ్రాములు ఉన్నట్లు పోలీసు అధికారి దీపాంజళీ ప్రదాన్ గురువారం వెల్లడించారు. బుధవారం కొంత మంది గ్రామీణులు అడవిలో వెళ్తుతుండగా వారికి ఒకచోట తెల్లని సంచులు తుప్పల్లో ఉండటం కనిపించింది. వెంటనే వారు బొయిపరిగుడ పోలీసులకు సమాచారం అందించారు.

పోలీస్ అధికారి దీపాంజళీ ప్రదాన్ ఆదేశాల మేరకు వెంటనే వెళ్లి దర్యాప్తు చేపట్టినట్లు సబ్‌ఇన్‌స్పెక్టర్ కృష్ణ చంద్ర సెథి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తన టీమ్‌తో బొయిపరిగుడ సమితి సెమిలిపొదర్ ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో దాడులు చేశారు. వారికి గంజాయి బస్తాలు కనిపించగానే అప్రమత్తమై ఎవరు కనిపించినా ఎదుర్కొనేందుకు సన్నద్ధమయ్యారు. సమీపంలో ఎవరూ కనించకపోవటంతో బస్తాలను విప్పి చూడగా గంజాయి బయటపడింది. బస్తాలను పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి తూకం వేయించారు. గంజాయిని దాచిన మాఫియాలో ఎవరూ పట్టుబడలేదని పోలీసులు వెల్లడించారు. గంజాయిని ఇతర ప్రాంతాల వారికి అమ్మేందుకు మాఫీయా ఎవరికీ కనిపించకుండా అడవిలో దాచి పెట్టారని, నిందితులను త్వరలో పట్టుకుంటమని పోలీసు అధికారి ప్రదాన్ వెల్లడించారు.

తొలిరోజు ఆరు నామినేషన్‌లు



ఎన్నికల అధికారికి నామినేషన్‌లు అందజేస్తున్న అభ్యర్థులు

జయపురం: జయపురం బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్‌ల పర్వం గురువారం ప్రారంభమైంది. నామినేషన్‌ల మొదటి రోజు ఆరుగురు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి అజితకుమార్ సాహు తన నామినేషన్‌ను ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్‌కు సమర్పించారు. కార్యదర్శి పదవికి సచిదానంద మిశ్ర, ఉపాధ్యక్ష పదవికి నబీన చంద్ర సాహు, ప్రసాద్ చంద్ర బిడిక నామినేషన్‌లను ఎన్నికల అధికారికి అందజేశారు. సహాయ కార్యదర్శి పదవికి అంజన సింగ్, కోశాధికారి పదవికి బి.రామనుజ ప్రసాద్ నామినేషన్‌లు దాఖలు చేశారు. నామినేషన్‌ల స్వీకరణలో ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్‌కు న్యాయవాదులు జ్యోతిరంజన్ పూజారి, ఎస్.ఎస్.సుందరమ్ సహకరించారు.

తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు



బాలుడికి చికిత్స చేస్తున్న వైద్యులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి పాత బొరిగుమ్మ గ్రామంలో బుధవారం అవాంఛనీయ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో ఒక పెళ్లి జరుగుతున్న సమయంలో గ్రామ దేవతకు పూజలు చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు పూజా మందిరంలోకి వచ్చి దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు 20 మందికి పైగా గాయపడ్డారు. గాయపడినవారిని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు చికిత్స అందించి, కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు.


అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి కె.సీతాపురం పంచాయతీ దేవదళ గ్రామంలో గురువారం అభయాంజనేయ మందిరంలో స్వామి వారి విగ్రహాన్ని పురుషోత్తం వరప్రసాద్ దంపతులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి గ్రామపెద్దలతో పాటు దేవాది రాజేష్‌కుమార్, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి తోడ్పాటు



మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం రమేష్‌కృష్ణ

శ్రీకాకుళం అర్బన్ : మహిళాభ్యున్నతికి నాబార్డు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక శక్తిగా ఎదగాలని నాబార్డు డీడీఎం కె.రమేష్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలో నాబార్డు, ఐసీడీఎస్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, స్వయం ఉపాధి అభివృద్ధి అంశాలపై మహిళలు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీఆర్‌డీఏ డీపీఎం ఏ.శ్రీగౌరి, సీఐ టి.త్రినేత్రి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ అనూష, డాక్టర్ వి.సునీత, సీడీపీవో శోభారాణి, డీసీసీబీ మేనేజర్ సంధ్యారాణి, ఝాన్సీ, లలిత, ఎఫ్‌పీఓలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

షూటింగ్ స్పాట్ లో సినిమా వాహనాలు



కొరాపుట్ జిల్లాలో రాజమౌళి సినిమా



దేవమాలిలో రాజమౌళి చిత్ర పోస్టర్

కొరాపుట్: ప్రపంచ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న కొరాపుట్‌లో రాజమౌళి, మహేష్ బాబు సినిమా షూటింగ్ జరుగుతోంది. రాజమౌళి, మహేష్ బాబు, ప్రియాంక చోప్రా ఇక్కడ మకాం వేశారు. ప్రముఖ పర్యాటక స్థలం దేవమాలిలో చిత్రీకరణ జరుగుతోంది. షూటింగ్‌స్పాట్‌కు 500 అడుగుల దూరంలో రాకపోకలు ఆపేశారు. సెల్‌ఫోన్లను కూడా అనుమతించడం లేదు.



తుల మాలి వద్ద సినిమా సెట్

బిజూ విగ్రహాన్ని ఆవిష్కరించాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి రబినారాయణ నందొ, తదితరులు

జయపురం: మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ విగ్రహాన్ని వెంటనే ఆవిష్కరించాలని బీజేడీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం విక్రమనగర్‌లో గల బీజేడీ పార్టీ భవనంలో పార్టీ సీనియర్ నేత బాలా రాయ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

మాజీ మంత్రి రబినారాయణ నందో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పంచాయతీ రాజ్ దినోత్సవ తేదీని ముఖ్యమంత్రి మోహణ మఝి మార్పుచేయటాన్ని మాజీ మంత్రి నందో ఖండించారు. బిజూ పేరు వింటే బీజేపీ భయపడుతుందన్నారు. బిజూ జయంతి రోజున పంచాయతీ రాజ్ దినోత్సవం జరుగుతుందేదని, ఆ తేదీని మార్చటం సరికాద ధ్వజమెత్తారు. ఈ చర్య బిజూను అవమాన పరచటమేనన్నారు. బిజూ పట్నాయక్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఏప్రిల్ 17వ తేదీ లోగా బిజూ విగ్రహాన్ని ఆవిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, మాజీ చైర్మన్ సూర్యనారాయణ రథ్, మాజీ కౌన్సిలర్ దుర్గా మిశ్ర, బీజేడీ నేతలు రమాకాంత రౌళో, నాగరాజు దొర, అనూప్ కుమార్ పాత్రో, బిష్ణు ప్రసాద్ పాత్రో, వివేకానంద పట్నామక్, శివ పట్నామక్, బాలంకి రావు, హరప్రసాద్ మిశ్ర, బీజేడీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంతాన దత్తత స్వీకార చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఎం రాజేంద్ర మింజ్



సమావేశానికి హాజరైన డాక్టర్లు, ఇతర చైల్డ్‌లైన్ అధికారులు

పర్లాకిమిడి: జిల్లా శిశు సురక్షా యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి కార్యాలయం మీటింగ్ హాల్‌లో సంతాన దత్తత స్వీకార నూతన చట్టం -2022, మైనర్ బాలికల ఎర్లీ ప్రెగ్నెన్సీని అరికట్టడంపై అధికారులు సమావేశంలో కూలంకషంగా చర్చించారు. జిల్లాలో మైనర్ బాలికల ప్రెగ్నెన్సీ సంఘటనలు అరికట్టాలని, అలాగే వారి సంతానం స్వీకరించే హక్కు ప్రైవేటు వ్యక్తులకు గానీ సంస్థలకు గానీ లేవని అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ అన్నారు. దురదృష్టవశాత్తు మెడికల్‌లో మైనర్ బాలిక నెలలు నిండకుండా ప్రెగ్నెంట్ అయ్యి శిశువుకు జన్మనిస్తే.. మెడికల్ అధికారులు, ఇతర దత్తత కేంద్రాలు శిశు సురక్షా యూనిట్‌కు సమాచారం ఇవ్వాలని అన్నారు. బాల్యవివాహాలు, కుమారీ మాతృత్వ ఘటనలు తగ్గించడానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సీడీఎంఓ డాక్టర్ ఎంఎం అలీ అన్నారు. సమావేశంలో జిల్లా శిశు సురక్షా సమితి అధ్యక్షులు అశ్వినీ కుమార్ మహాపాత్రో, జిల్లా శిశు సురక్షా అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, సబ్ డివిజనల్ పోలీసుఅధికారి మాధవానంద నాయక్, జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిని మనోరమాదేవి, సాధన వ్యక్తి ఘాసిరాం పండా, మరియు చైల్డ్‌లైన్, ఒన్ స్టాప్ సెంటర్ అధికారులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో దొంగలు హల్‌చల్



నాగేశ్వరరావు ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. పట్టణ శివారులో జాతీయ రహదారి సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న శ్రీనివాసనగర్‌లో రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తొలుత వీధిలో ఉన్న సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి పట్నాల నాగేశ్వరరావు ఇంట్లో చొరబడ్డారు. నాగేశ్వరరావు కుటుంబం దైవదర్శనాల టూర్‌లో ఉండటంతో ఇదే అదునుగా బీరువాను తెరిచి చిందరవందర చేశారు. ఇంటి ముందు సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. ఇంట్లో ఏయే వస్తువులు చోరీకి గురయ్యాయో నాగేశ్వరరావు కుటుంబం తిరిగి వస్తే తప్ప స్పష్టత రాదు. ఈ ఇంటికి సమీపంలో ఉంటున్న పోలాకి మండలం రేవు అంప్లాం పంచాయతీ కార్యదర్శి టి.దుర్గాప్రసాద్ ఇంట్లో కూడా దుండగులు చోరీకి ప్రయత్నించారు. అక్కడ ఏమీ దొరక్కపోవడంతో గేటు విరగ్గొట్టి వెళ్లిపోయారు. గురువారం విషయం తెలుసుకున్న నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్ చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. కాగా, దేవుడు బొమ్మలతో మూడు చక్రాల రథాలపై కొందరు వచ్చారని, చోరీ వీరి పనే అయి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు.

సాంకేతిక అంశాలపై పట్టు అవసరం



టెక్నివేర్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సాంకేతిక అంశాలపై పట్టు అవసరమని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.వి జయ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ (ఎస్ఎంపురం)లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్ టెక్నివేర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం, సాంకేతిక అంశాల అవగాహన ఆధారంగా కార్యక్రమం జరుగుతుందని, 600 కళాశాలలను ఆహ్వానించామని చెప్పారు. ఐఐటీ, ఎన్ఐటీ ప్రొఫెసర్లు, సాంకేతిక నిపుణులను రిసోర్సుపర్సన్లుగా ఆహ్వానించినట్లు తెలిపారు. ప్లేస్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పారు.

క్లుప్తంగా

8న సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి గురువారం తెలిపారు. నగరంలోని సిటీ క్లబ్ ఆవరణలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 16 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండి 55 కేజీల బరువు కలిగిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. జిల్లా జట్ల ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లాలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9949721949 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్


గంజాయి స్వాధీనం చేసుకుని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

నెల్లిమర్ల: గంజాయి లావాదేవీలు చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి.గణేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిశాలోని రాయగడ నుంచి గంజాయిని నెల్లిమర్ల పట్టణంలోని చంపావతి నది తీరంలో థామస్ పేట గ్రౌండ్ వద్దకు తరలిస్తున్న వ్యక్తి, దానిని కొనుగోలు చేసిన వ్యక్తిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నెల్లిమర్లకు చెందిన వ్యక్తి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో వినియోగ దారులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారిద్దరి దగ్గర సుమారు ఒక కేజీ 160 గ్రాముల గంజాయిని సీజ్ చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


కర్రి ప్రసాద్ (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండలంలోని జమ్మిడివలస గ్రామానికి చెందిన కర్రి ప్రసాద్(39) రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి గురువారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరీక్ష నిమిత్తం విజయవాడ వెళ్లి తిరిగి స్వగ్రామానికి ట్రైన్‌లో వస్తుండగా మార్గమధ్యంలో అనకాపల్లి వద్ద ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడు ఆర్మీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి ..



ప్రసాద్ వర్మ మృతదేహం

రామభద్రపురం: మండలం పరిధిలోని తారాపురం టీకాల లచ్చన్న గుడి వద్ద గురువారం రెండు బైక్‌లు ఢీ కొని ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామ్‌గోపాల్ గౌతం, సాన్వర్ ప్రసాద్ వర్మ స్నేహితులు. వారిద్దరూ కొన్ని నెలల క్రితం జీవనోపాధి కోసం సాలూరుకు వచ్చి కొత్తభవనాలకు పుట్టీలు, సీలింగ్‌లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని సొంతూరుకు వెళ్తానని బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో డ్రాప్ చేయమని రామ్‌గోపాల్‌ను ప్రసాద్ వర్మ కోరడంతో ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు బయల్దేరి వెళ్తున్నారు. సరిగ్గా తారాపురం టీకాల లచ్చన్న గుడి వద్దకు వచ్చేసరికి వారికంటే ముందుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న అనకాపల్లి జిల్లా రామవరం గ్రామానికి చెందిన రామదాసు సొంతూరుకు వెళుతూ గుడిలో అమ్మవారిని దర్శించుకుందామని బైక్ స్లో చేశాడు. ఇంతలో వెనకనుంచి వస్తున్న ఇద్దరు స్నేహితులు ముందున్న బైక్‌ను ఢీకొట్టడంతో బైక్ వెనుక కూర్చున్న ప్రసాద్ వర్మ(42) ప్రమాదవశాత్తు తుళ్లిపోయి రోడ్డు దెబ్బతిన్నాడు. దీంతో తలకు తీవ్రగాయం కాగా, రామ్‌గోపాల్ గౌతమ్‌కు, రామదాసుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్సై వి.ప్రసాదరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రథమ చికిత్స నిమిత్తం గాయపడిన ముగ్గురిని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడికి చేరుకునే సరికి ప్రసాద్ వర్మ మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు ఎస్సై ప్రసాదరావు కేసే నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

బొండపల్లి: మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలుడు మరో గ్రామానికి చెందిన బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాధిత బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. బాలికతో పాటు బాలిక తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


జంఝావతి ప్రాజెక్టు

ఎన్నాళ్లీ... జంఝాటం!

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- బడ్జెట్‌లోనూ అరకొర కేటాయింపులు
- ఒడిశాతో చర్చలకు ఇదే సమయమంటున్న రైతులు

దశాబ్దాలు గడుస్తున్నా.. జంఝాటం వీడటం లేదు. జంఝావతి కంఠ ఘోష ఎవరికీ వినిపించడం లేదు. ఒడిశా మడత పేచీ.. ఇక్కడి రైతులకు శాపంగా మారింది. ప్రస్తుతం అటు ఒడిశాతో పాటు.. ఇటు ఏపీలోనూ కేంద్రం మద్దతుతో నడుస్తున్న ప్రభుత్వాలే ఉన్నాయి. వివాదం పరిష్కారానికి ఇదే సరైన సమయమని.. ఏపీలోని కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించి, జంఝావతి విషయంలో ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి, సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక కూటమి నేతలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కేటాయించిన బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు లేకపోవడంపై రైతు సంఘం నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, పార్వతీపురం మన్యం:

కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం వద్ద జంఝావతి ప్రాజెక్టుకు 1976లో శ్రీకారం చుట్టారు. అప్పట్లో రూ.15.51 కోట్ల అంచనా వ్యయంతో దీనిని ప్రారంభించారు. కొమరాడ, గరుగుబిల్లి, పార్వతీపురం, సీతానగరం, మక్కువ మండలాలకు నీటిని అందించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి ఒడిశాలో వర్షాలు కురిస్తేనే నదిలో నుంచి వచ్చిన నీటిని ఇక్కడ ఒడిసిపట్టవచ్చు. జలాశయం పూర్తయితే ఒడిశా రాష్ట్రంలోని మూడు గ్రామాలతోపాటు.. కొంత అటవీ ప్రాంతం ముంపు బారిన పడతాయి. దీంతో గేట్ల ఏర్పాటు సవాల్‌గా మారింది. ఇరు రాష్ట్రాల మధ్య వివాదమై కూర్చొంది. గతంలో పలు దఫాలు ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగాయి. నగుల్లువలస, చీకటిలోవ, పిల్లిగుడ్డి గ్రామాల వారికి పునరావాసంతోపాటు.. నష్టపోతున్న ప్రాంతానికి పరిహారం ఇచ్చేందుకు కూడా ఏపీ ప్రభుత్వం ముందుకొచ్చింది. గేట్ల ఏర్పాటుకు మాత్రం ఒడిశా ప్రభుత్వం అంగీకరించలేదు. స్పిల్‌వే దగ్గర పనులు చేసుకునేందుకు మాత్రమే అంగీకరించింది. దీంతో 1980వ దశకంలో కొమరాడ మండలంలోని జంఝావతి ఎగువ, దిగువ కాలువల నుంచి 24 వేల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా రూ.124 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు పనులు చేపట్టారు. ఎనిమిది వేల ఎకరాలకు మాత్రమే నీరు ఇవ్వగలిగారు. అప్పటి నుంచి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పూర్తి కాకపోవడంతో రైతులకు అరకొర సేవలే అందుతున్నాయి. ఒడిశా ప్రభుత్వంతో చర్చలు సఫలమైతే ఇక్కడి రైతాంగానికి మేలు చేకూరుతుంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కూడా ఈ సమస్యపై దృష్టి సారించారు. ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపారు. అటు నుంచి సానుకూలత రాకపోవడంతో సమస్య కూడా అలానే ఉండిపోయింది.

అసలే వివాదం.. ఆపై అరకొర కేటాయింపులు

పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడం వల్ల శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితి ఉంది. 27,790 కిలోమీటర్ల పొడవు ఉన్న ఎగువ కాలువ ద్వారా కొమరాడ, పార్వతీపురం, సీతానగరం మండలాలల్లో 12 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కొమరాడ మండలం డంగభద్ర వద్ద పెద్ద బండరాయి ఉండటంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దిగువ కాలువ నుంచి ఎగువ కాలువకు నీరును ఎత్తిపోసేందుకు ఏర్పాటు చేసిన పథకం మరమ్మతులకు గురైంది. దీనివల్ల కేవలం 700 ఎకరాలకు మాత్రమే నీరందే పరిస్థితులు ఉన్నాయి. దిగువ కాలువ ద్వారా గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ, సీతానగరం మండలాల్లోని 12 వేల ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. కాలువ పనులు జరిగినా నీరు మళ్లించే మదుముల వద్ద షట్టర్లు ఏర్పాటు చేయలేదు. పంటభూములకు సాగునీరు చేరేలా పిల్ల కాలువలనుతవ్వాల్సి ఉంది. కొన్నిచోట్ల యూటీలు నిర్మించాలి. ఈ పనులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాల్సి ఉన్నా.. కూటమి ప్రభుత్వం కనీసం దృష్టి సారించడం లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో జంఝావతి ప్రాజెక్టుకు కనీస నిధులు కేటాయించక పోవడం పట్ల ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి తీవ్ర స్థాయిలో ఖండించింది. ప్రాజెక్టు వద్ద నిరసన వ్యక్తం చేసింది. జంఝావతికి బడ్జెట్లో ఎటువంటి ప్రాధాన్యత లేకపోవడం దారుణమని చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు, ప్రతినిధులు వి.దాలినాయుడు, వి.శ్రీహరి, టి.ప్రభాకరరావు, బి.కృష్ణ అన్నారు. ఇది పూర్తిగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల వైఫల్యమేనని విమర్శించారు. రెండు రాష్ట్రాల్లోనూ కూటమి అనుకూల ప్రభుత్వాలే ఉన్నాయని.. ఒడిశాతో ఉన్న అతి చిన్న సమస్యను పరిష్కరించడానికి ఇదే మంచి సమయమని తెలిపారు. పాలకులు ఆ దిశగా ఆలోచించకపోవడం బాధాకరమన్నారు.


జంఝావతి ప్రాజెక్టు



ఆస్ట్రియా సాంకేతికతతో రబ్బరు డ్యాం..

2006లో ఆస్ట్రియా సాంకేతికతతో నాటి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఇక్కడ రబ్బరు డ్యాం ఏర్పాటు చేసింది. దీని ద్వారా 12 వేల ఎకరాలకు నీరివ్వాలని భావించారు. 3.60 కిలోమీటర్ల లింకు కాలువను తవ్వి, డిస్ట్రిబ్యూటరీతో అనుసంధానించడం ద్వారా మరో 12 వేల ఎకరాలకు తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు 650 హార్స్ పవర్ గల మూడు మోటార్లను, ప్రత్యేకంగా విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. తాత్కాలికంగానైనా చేపట్టిన ఈ ప్రక్రియ వల్లే 15 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.

హోమ్‌గార్డు కుటుంబానికి పోలీస్ శాఖ 'చేయూత

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో పని చేసి, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోమ్‌గార్డు కుటుంబానికి పోలీస్ శాఖ చేయూత అందించింది. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్ తన కార్యాలయంలో గురువారం హోమ్ గార్డు కుటుంబానికి సుమారు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఏడాది పొడవునా హోమ్‌గార్డు సిబ్బంది పోగు చేసిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్స్ చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు భార్య వి.సత్యవతికి ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, హోమ్‌గార్డ్స్ ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్‌కుమార్, డీపీఓ సూపరింటెండెంట్ ఏఎస్వీ ప్రభాకరరావు, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ఘనంగా జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఔషధ విద్యకు పునాది వేసిన ప్రొఫెసర్ మహాదేవ్ లాల్ ష్రాఫ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ ఈ ఏడాది ఫార్మా, పార్మసీ ప్రాక్టీస్‌లో వ్యవస్థాపక స్టార్టప్‌లు ప్రోత్సహించడమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పేర్కొందని, ఆ దిశగా విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు.

శిక్షణ ప్రారంభం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు సెంచూరియన్‌లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం ప్రారంభించారు. గ్రామీణ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకువెళ్తున్నామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

కుక్కల దాడిలో 10 మేక పిల్లల మృతి

మెంటాడ: లోతుగెడ్డ గ్రామంలో కర్రి అక్కయ్యకు చెందిన 10 మేక పిల్లలు కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అక్కయ్య పిట్టాడ గ్రామానికి మేకల మందను మేత కోసం తీసుకువెళ్లి మేక పిల్లలను గూడులో ఉంచాడు. ఆ గూడుపై కుక్కలు దాడి చేసి 10 మేక పిల్లలను చంపివేశాయి. మృతి చెందిన మేక పిల్లల విలువ సుమారు 50 వేల రుపాయలు ఉంటుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు,

ఓపెన్ హౌస్‌తో పోలీస్ వ్యవస్థపై అవగాహన


ఆయుధాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



అబ్బుర పరిచిన జాగిలాల విన్యాసం

పార్వతీపురం రూరల్: మహిళ సాధికార వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని చాకలి బెలగాంలో ఉన్న పోలీస్‌శాఖ మల్టీఫంక్షన్ హాల్ ఆవరణంలో గురువారం ఓపెన్ హౌస్ ఫర్ ఉమెన్ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్‌శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎస్పీ మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతే ప్రాధాన్యంగా పోలీసుశాఖ నిరంతరం పనిచేస్తుందని మార్చి 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ సాధికార వారోత్సవాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. పోలీస్‌శాఖ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వినియోగించే ఆయుధాలను, పోలీస్‌శాఖలో కీలకమైన సాంకేతిక వ్యవస్థను, నేరస్థలంలో సాక్ష్యాలను సేకరించేందుకు క్లూస్‌టీమ్ ఉపయోగించే పరికరాలు, డాగ్‌స్క్వాడ్ పనితీరును కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి కళాశాల విద్యార్థినులు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్‌సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా కొన్ని ఆయుధాలు వినియోగించే పద్ధతులను మహిళలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన జాగిలాల విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురానా, డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ఐలు రాంబాబు, నాయుడు, టౌన్ సీఐ మురళీధర్, రూరల్ ఎస్సై సంతోషి, శాఖాపరమైన సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా వక్ఫ్ ఆస్తుల సర్వే

విజయనగరం అర్బన్: జిల్లాలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, దీనిలో భాగంగా ఈ నెలాఖరులోగా స్థలాల సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా స్థాయి వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ చాంబర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్ఫ్ స్థలాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం అవకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో మైనారిటీ సంక్షేమశాఖ రికార్డుల ప్రకారం మొత్తం 96 వక్ఫ్ స్థలాలను గుర్తించినట్లు చెప్పారు. మొత్తం ఆ స్థలాల వివరాలను వెంటనే సంబంధిత ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలని వక్ఫ్, మైనారిటీ శాఖాధికారులకు సూచించారు. అలాగే ఇవే కాకుండా రెవెన్యూ, టౌన్ రికార్డుల్లో ఉన్న మొత్తం వక్ఫ్ స్థలాల వివరాలను సేకరించి, వాటిని సర్వే చేసి, నమూనా పటాలతో సహా ఈ నెలాఖరుకు అందజేయాలని, అనంతరం ఈ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌కు పేర్లు నమోదు చేసుకోవాలి

వీడియో వీక్షించేందుకు స్కాన్ చేయాల్సి క్యూఆర్ కోడ్

పార్వతీపురం: నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు యువత తమ వివరాలను నమోదు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా కె. వెంకట్ ఉజ్వల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని, యువత మేధాశక్తిని ఉపయోగించడంలో ప్రపంచంలో కెల్లా మన దేశం ప్రథమ స్థానంలో ఉండాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 25ఏళ్ల వయస్సు కలిగిన వారు ఈ యూత్ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. యువత మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని తరువాత ఒక్క నిమిషం నిడివి కలిగిన "వాట్ డజ్ వికసిత్ భారత్ మీన్ టూ యూ" అనే అంశంపై వీడియో చేసి మార్చి 9 అర్ధరాత్రిలోపు మై భారత్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

జిల్లాస్థాయిలో వన్‌నేషన్, వన్ ఎలక్షన్, పేవింగ్ ది వేఫర్ వికసిత్ భారత్ అనే అంశంపై మూడు నిమిషాలు మాట్లాడాలని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సంస్థ రూపొందించిన వీడియోను వీక్షించేందుకు క్యూఆర్‌కోడ్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు.

భూములు లాక్కుని కడుపు కొట్టొద్దు

- బైపాస్ నిర్వాసితుల సమావేశం
- భూమి ధర పెంచాలని రైతుల పట్టు


నిర్వాసిత రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డీటీ హరికిరణ్


సమావేశానికి హాజరయిన నిర్వాసిత రైతులు

శృంగవరపుకోట: మాకు జీవనాధారమైన భూములు లాక్కుని కడుపు కొట్టకండి. అడిగిన ధర ఇవ్వకుండా మా భూములు లాక్కుంటే మేం ఏం కావాలి. ప్రభుత్వమే భూములు లాక్కుంటామంటే ఎవరికి చెప్పుకోవాలంటూ నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ–బొడ్డవర జాతీయ రహదారి 516బి రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా మండలంలోని కొత్తూరు నుంచి కాపుసోంపురం వరకు కొత్తగా నిర్మాణం చేయనున్న బైపాస్ రహదారి ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో సూచనల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ల్యాండ్ అక్విజిషన్ డీటీలు కె. హరికిరణ్, ఎస్.కోట ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.భరత్‌కుమార్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీటీ హరికిరణ్ మాట్లాడుతూ రైతుల నుంచి భూమిని ఐదు కేటగిరిలుగా తీసుకుంటామని, ఎస్ఆర్ఓ నిర్ధారించిన మార్కెట్ ధర కన్నా రెండున్నర రెట్లు అధికంగా చెల్లిస్తామని చెప్పారు. ముందుగా అవార్డు ప్రకటించి, నగదు చెల్లించిన తర్వాత పనులు ప్రారంభిస్తారని రైతుల ప్రశ్నకు బదులు చెప్పారు. దీనిపై పలువురు రైతులు మాట్లాడుతూ ఐదు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలు ఫిబ్రవరిలో పెంచిన భూముల ధరల ఆధారంగా పరిహారం చెల్లించాలని కోరారు. దీనిపై డీటీ హరికిరణ్ బదులిస్తూ నోటిఫికేషన్ ఇచ్చే తేదీ నాటికి ఉన్న మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తామని, గజాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా, ఎస్ఆర్ఓ రికార్డుల్లో గజాల్లో నమోదై ఉంటేనే గజాల్లో చెల్లింపులు చేస్తారని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో యాజమాన్య హక్కులు ఉన్న వారికే చెల్లింపులు చేస్తారని చెప్పారు.

'పరిహారం పెంపు అధికారం లేదు

మేము జిల్లా అధికారులం కాదు. ఏమీ చేయలేం. మీ వినతులు జిల్లా అధికారులకు వివరిస్తాం అంటూ అధికారులు రైతుల డిమాండ్లకు బదులిచ్చారు. దీంతో రైతులు మాట్లాడుతూ నోటిఫికేషన్ ఇచ్చిన రోజు మాకు చెప్పి ఇచ్చారా? మా ఆస్తి తీసుకుని మా ఉపాధి లాక్కునేటప్పుడు మీ ప్రభుత్వాలు నిర్ణయించిన మార్కెట్ ధర అడిగితే ఇవ్వరా? ఇదెక్కడి న్యాయం, మా కుటుంబాలు ఏం కావాలి అంటూ భోరుమన్నారు. కొందరు రైతులు అధికారులకు దండాలు పెట్టి మాకు న్యాయం చేయండి, మా కడుపులు కొట్టకండి అంటూ మొరపెట్టుకున్నారు. రైతులు తమ అంగీకారం చెప్పకపోవడంతో అసంపూర్తిగానే సమావేశం అయ్యిందని పించారు. సమావేశంలో పలువురు రైతులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపులో నెల్లిమర్ల ఫస్ట్

- పట్టణాల్లో ఆస్తి పన్ను వసూళ్లలో అధికారులు బిజీ
- 73.96 శాతం వసూళ్లతో నెల్లిమర్ల నగర పంచాయతీ ముందంజ
- నాలుగు పట్టణాల్లో పన్ను డిమాండ్ రూ.51.37 కోట్లు
- ఇప్పటివరకు వసూలైనది రూ.28.56 కోట్లు
- బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్న యంత్రాంగం

విజయనగరం: ఆస్తి పన్ను చెల్లింపులో నెల్లిమర్ల నగరపంచాయతీ ప్రజలు జిల్లాలో ముందంజలో ఉన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు (మార్చి 31) దగ్గర పడుతుండడంతో ఆస్తి పన్ను వసూళ్లలో కార్పొరేషన్, మున్సిపల్, నగర పంచాయతీ అధికారులు నిమగ్నమయ్యారు. మొండిబకాయిల వసూళ్లే లక్ష్యంగా నోటీసులు జారీ చేస్తున్నారు. పన్నులు చెల్లించి పట్టణాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు. విజయనగరం జిల్లా పరిధిలోని విజయనగరం కార్పొరేషన్‌తో పాటు బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ రూ.51.37 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.28.56 కోట్లు వసూలు చేశారు. మొత్తం డిమాండ్‌లో 55.59 శాతం మున్సిపల్ ఖజానాకు చేరింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మొదటి విడత, అక్టోబర్ నుంచి మార్చి వరకు రెండో విడతగా పన్నులు వసూలు చేయడం సహజం. ఇప్పటి వరకు నెల్లిమర్ల నగర పంచాయతీ 73.96 శాతం వసూళ్లు చేసి మొదటి స్థానంలో నిలవగా.. 60.91 శాతం వసూళ్లతో బొబ్బిలి మున్సిపాలిటీ రెండవ స్థానంలో, 59 శాతం వసూళ్లతో రాజాం మూడవ స్థానంలో, 53.95 శాతం వసూళ్లతో విజయనగరం కార్పొరేషన్ చివరి స్థానంలో ఉంది. నీటిపన్ను వసూళ్లలో సైతం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. సిబ్బంది పై ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచడంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పన్నుల వసూళ్లకు శ్రీకారం చుట్టారు.


విజయనగరంలో పన్ను చెల్లించలేదన్న కారణంతో దుకాణాన్ని సీజ్ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు


పన్ను బకాయిదారుల జాబితాను సచివాలయంలో ప్రదర్శిస్తున్న సిబ్బంది

ప్రాంతం	భవనాల సంఖ్య	పన్ను డిమండ్	వసూలైనది	శాతం
విజయనగరం	70,413	రూ.41.15కోట్లు	రూ.22.20 కోట్లు	53.95
బొబ్బిలి	12,949	రూ.5.53 కోట్లు	రూ.3.37 కోట్లు	60.91
రాజాం	12,289	రూ.3.22కోట్లు	రూ.1.90 కోట్లు	59.00
నెల్లిమర్ల	5,452	రూ.1.48కోట్లు	రూ.1.10కోట్లు	73.96


నగరంలోని భవనాలు

● బకాయిదారులపై కొరడా..

ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు దగ్గర పడుతుండడంతో పన్నుల వసూలుకు బకాయిదారులపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. మొండి బకాయిదారుల జాబితాను సిద్ధంచేసి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. అప్పటికీ స్పందించకుంటే ఇంటికి వేసిన తాగునీటి కుళాయి కనెక్షన్లను తొలగిస్తున్నారు. పన్ను బకాయి దారుల జాబితాలను కార్పొరేషన్/మున్సిపల్ కార్యాలయాలతో పాటు అన్ని సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నారు. దీర్ఘకాలికంగా బకాయిపడిన వారి దుకాణాలను సీజ్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పన్నుల వసూళ్లపై యంత్రాంగం ఒత్తిడి చేస్తోందన్న చర్చ పట్టణాల్లో సాగుతోంది.

పన్నులు చెల్లించాలి



స్థానిక సంస్థల అభివృద్ధికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే కీలకం. ఆదాయం వస్తేనే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు దగ్గర పడుతోంది. ప్రజలంతా సహకరించి పన్ను బకాయిలు చెల్లించాలి. ఆన్‌లైన్‌లోను, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో పన్ను చెల్లించి రసీదు పొందాలి. లేని పక్షంలో మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్